

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరేశ్

## రుమటాలజీపై అవగాహన కలిగి ఉండాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 12 : రుమటాలజీపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ రుమటాలజిస్ట్, కీళ్లవైద్య నిపుణుడు డాక్టర్ ఏ నరేశ్ అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ఆర్థరైటిస్ అండ్ రుమటిజం సెంటర్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ మన శరీరంలో ఇమ్యూన్ సిస్టంలో సమతుల్యత లోపించినప్పుడు మనల్ని రక్షించాల్సిన వ్యాధి నిరోధకత మన శరీరంపైనే దాడి చేయడం వల్ల ఆటో ఇమ్యూన్ వ్యాధులు వస్తాయన్నారు. జన్యువులు, పరిసరాలు, హార్మోన్ల వంటి అంశాలు వ్యాధికి కారణమవుతుంటాయన్నారు. కీళ్లనొప్పులు, కీళ్లవాపులు, ఉదయం లేవగానే కీళ్లలో మెడ, నడుం నొప్పితో బిగిసుకుపోవడం, నోరు పొడిబారిపోవడం, జుట్టు ఎక్కువగా రాలడం, ముఖం మీద సీతాకోకచిలుక ఆకృతితో ముక్కుకు ఇరువైపులా ఎర్రటి మచ్చలు రావడం, నోట్లో పుండ్లు, విపరీతమైన అలసట జ్వరం వస్తూ, తగ్గుతూ ఉండడం వంటి లక్షణాలు వ్యాధిగ్రస్తుల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ కాకుండా చికిత్స ఆలస్యమైతే క్రమేణా ఈ వ్యాధి శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాపించే అవకాశముంటుందని తెలిపారు. ముందుస్తు జాగ్రత్తలతో వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు.




బైక్‌ను విడుదల చేస్తున్న కార్పొరేటర్లు షీబారాణి, విజయలక్ష్మి

## మార్కెట్‌లోకి పల్సర్ ఎన్150 సరికొత్త మోడల్

వరంగల్, అక్టోబర్ 12 : బజాజ్ ఆటో లిమిటెడ్ సంస్థ మార్కెట్‌లోకి పల్సర్ ఎన్150 సీసీ వాహనాన్ని విడుదల చేసింది. నగరంలోని అనిక బజాజ్ షోరూంలో ఈ వాహనాన్ని కార్పొరేటర్లు జన్ను షీబారాణి, దేవరకొండ విజయలక్ష్మి ఆవిష్కరించారు. రెండు దశాబ్దాలకు పైగా మార్కెట్‌లో స్పోర్ట్స్ బైక్‌లలో ప్రత్యేక ఆదరణ పొందుతున్న పల్సర్ బ్రాండ్‌లో సరికొత్తగా ఎన్ 150 మోడల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం అభినందనీయమని వారు అన్నారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం సుగ్గం గిరిధర్, అనికా బజాజ్ సిబ్బంది పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రసాద్, ఫార్మసీ విద్యార్థులు

## విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 12 : విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ ప్రసాద్ అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన 'మేరి మట్టి మేరీ దేశ్' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రసాద్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జాతీయ భావన, దేశం పట్ల గౌరవం, ఈ నేల పట్ల అభిమానం జీవితాంతం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ సునీత, శశిధర్‌తోపాటు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి బీఆర్ భగవాన్‌దాస్

- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- భగవాన్‌దాస్ 20వ వర్ధంతి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 12: పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నేత కామ్రేడ్ బీఆర్ భగవాన్‌దాస్ అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం బీఆర్ భగవాన్‌దాస్ 20వ వర్ధంతిని హనుమకొండ అశోకా జంక్షన్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్‌దాస్ విగ్రహానికి చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పేదల హక్కుల కోసం తన జీవిత కాలం పోరాడిన మహనీయుడు భవవాన్‌దాస్ అని అన్నారు. ఆయన కుటుంబంతో తనకు ఎనలేని సంబంధం ఉందన్నారు. భగవాన్‌దాస్ ఆశయాలను ముందు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధభవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బీఆర్ అంబేద్కర్, డాక్టర్ రాజ్‌సిద్ధార్థ, బుద్ధభవన్ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బీఆర్ లెనిన్, కార్యదర్శి గోకారపు శ్యామ్ కుమార్, స్థానికులు శంకర్, కన్నీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భగవాన్‌దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

### వేముల మాతృమూర్తి మృతిపై చీఫ్ విప్ సంతాపం

హనుమకొండ : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ మృతిపట్ల చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మంజులమ్మ ఆత్మకు చేకూరాలని భగవంతున్ని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సీ కమ్యూనిటీ సభ్యులు

# చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ వెంటే ఉంటాం

**గ్రేటర్ 29వ డివిజన్ ఎస్సీ కమ్యూనిటీ సభ్యుల ప్రతిజ్ఞ**

గిర్మాజీపేట, అక్టోబర్ 12 : చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ వెంటే ఉంటామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి, వచ్చే ఎన్నికల్లో వినయ్‌భాస్కర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని 29వ డివిజన్ ఎస్సీ కమ్యూనిటీ వర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. గురువారం వారు డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమై వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించుకునేలా కార్యాచరణ ప్రణాళికపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో 29వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, తాళ్లపల్లి రమేశ్, గొర్రె కుమార్, మైదం కరుణాకర్, మంద చంటి, గొర్రె అరుణ్‌కుమార్, మిద్దపాక ఆనంద్, ముత్యాల మహేందర్, మాదాసు ఎలీషా, తెలకలపల్లి సారంగం, ఆనగల సమ్మయ్య, రేండ్ల జంపయ్య, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఆర్ట్స్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

హనుమకొండ, అక్టోబర్ 12 : తెలంగాణ సంప్రదాయక పూల పండుగ(బతుకమ్మ)ను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ విద్యార్థులతో పాటు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొనాలని కోరారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేశ్ పాల్గొని బతుకమ్మ సంబురాలను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

## బల్దియాలో టీపీఎస్‌ల బదిలీలు

వరంగల్, అక్టోబర్ 12 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో టీపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న తేజస్వీని విజ్ఞప్తి మేరకు ఆమెను డిప్యూటేషన్‌పై నాలుగు రోజులు ఖమ్మం కార్పొరేషన్, రెండు రోజులు ఇల్లందు మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించేలా డీటీసీపీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఇల్లందు మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న అవినాష్ విజ్ఞప్తి మేరకు ఆయనను గ్రేటర్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

# బాలికా విద్యకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి**

హనుమకొండ, అక్టోబర్ 12 : బాలికా విద్యకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) ఝాన్సీ లక్ష్మీబాయి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా సంక్షేమాధికారి కే మధురిమ అధ్యక్షతన జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో జిల్లా బాలల సంరక్షణ కేంద్రాల ప్రతినిధులు, పిల్లలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆర్‌జేడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మీబాయి మాట్లాడుతూ బాలికా సంరక్షణ కోసం ప్రధానంగా రక్షణ, సంరక్షణ లేని బాలికలకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. జిల్లాలో ఎవరైనా నిరాదరణకు గురైన బాలికలను గుర్తించి వారికి విద్యను ఆయుధంగా అందివ్వాలన్నారు. తద్వారా వారు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, బాలికలపై చూపే వివక్ష రూపుమాపడానికి దశల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కోసం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. పోక్సో బాధిత పిల్లలకు పోక్సో 2020 రూల్ 8 ప్రకారం సంబంధిత రిలీఫ్ ఫండ్ రికమెండ్ చేయవచ్చన్నారు. అందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి మధురిమ మాట్లాడుతూ గ్రామాల్లో బాలికలపై వివక్ష రూపు మాపడానికి గ్రామ, మండల, పట్టణ జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికా సదనం, రీచ్, ఆసుంతా ఆశా నిలయం బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలికా సాధికారత కోసం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, ఉత్తమ ప్రతిభ కనబరచిన పిల్లలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్ పాష, డీటీడీవో ప్రేమకళ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, ఎస్ రాజేంద్ర ప్రసాద్, డెమో అశోక్‌రెడ్డి, డీసీపీవో సంతోష్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎస్ భాస్కర్, జీసీడీవో సునీత, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీ రాధ, సీడీపీవో బీ భాగ్యలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి